1

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 15 డిసెంబర్ 2023 | www.navatelangana.com

ఆత్మీయ సత్కార కార్యక్రమానికి తరలిరావాలి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఈ నెల 16 న హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో గిరిజన మంత్రి సీతక్కతో పాటు 12 మంది గిరిజన ఎమ్మెల్యేలకు గిరిజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుగులోతు వీరన్న నాయక్ పత్రిక ప్రకటనలో తెలిపారు. రవీంద్ర భారతిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి, విశిష్ట అతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గిరిజన మంత్రి సీతక్క, గిరిజన ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆత్మీయ సత్కార కార్యక్రమంలో భాగంగా గిరిజన తెగలతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమానికి రాష్ట్రంలో 33 తెగలుగా ఉన్న గిరిజనులు, గిరిజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చౌటపల్లిలో గ్రామైక్య సంఘ మహిళలకు చీరల పంపిణీ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో మారుతి గ్రామ మహిళ సంఘంలోని అధ్యక్షులకు సర్పంచ్ గద్దల రమేష్ గురువారం ఏకరూప చీరలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలోని మారుతి మహిళా సంఘాల వారందరికీ చీరలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చానన్నారు. మాట ప్రకారం వారందరికీ చీరలు పంపిణీ చేశానని తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోశెట్టి , సంఘం అధ్యక్షులు, గ్రామ పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు కొలుగురి శారద, మాజీ సర్పంచ్ వెల్డి శోభారాణి, మాజీ మహిళ అధ్యక్షురాలు కొత్తకొండ విజయ, గ్రామ సంఘం సభ్యులు కుక్కల లక్ష్మి, గడ్డమీది సుజాత, గద్దల వీరలక్ష్మి గ్రామ పంచాయతీ సిబ్బంది పరుషరాములు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువవుదాం



జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

'ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతూ, ఆపద సమయంలో మేమున్నామన్న భరోసా ప్రజలకు ఇవ్వాలి. ప్రజలలో పోలీసుల గౌరవాన్ని పెంచేలా విధులు నిర్వర్తించాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువవుదాం' అని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి, జహీరాబాద్ సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన దర్బార్‌కు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాజ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ కంప్యూటర్‌పై, అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. సిబ్బంది సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సూపర్ మార్కెట్ తరహాలో కాంటీన్ ఆధునీకరణ, ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డు, పతకాల అందజేత, సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డా.పి.అశోక్, రఘు డీఎస్పీ జహీరాబాద్, రమేష్ కుమార్, డీఎస్పీ సంగారెడ్డి, డీపీవో, సూపరింటెండెంట్ వెంకటేశం, అశోక్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్‌ను కలిసిన నాయకులు



నవ తెలంగాణ - సిద్దిపేట

వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ రాజనర్సింహను సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు కలీమొద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి



నవ తెలంగాణ- దుబ్బాక

నిస్వార్థ సేవకుడు, జనం మెచ్చిన ప్రజా నాయకుడు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంగెం ప్రభాకర్ ముదిరాజ్ అన్నారు. ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ప్రజల హృదయాల్లో నిలిచారని, అందుకే ఆయనకు 53 వేల పైచిలుకు మెజార్టీని అందించారన్నారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సహకారంతో మెదక్ ఎంపీగా కొత్త ప్రభాకర్ రెడ్డి తనదైన శైలిలో దుబ్బాకను అభివృద్ధిలో పరుగులు పెట్టించారన్నారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటూ రాబోవు రోజుల్లో దుబ్బాకను అభివృద్ధిలో మరింత ముందు వరుసలో నిలుపుతాడని ధీమా వ్యక్తం చేశారు. దొడ్ల కిషన్, వరప్రసాద్, ఉపేందర్, కాషయ్య ఉన్నారు.

కువైట్‌లో నందిగామవాసి మృతి



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన పాపయ్యగారి బాబు(30) అనారోగ్యంతో కువైట్ దేశంలో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆ గ్రామానికి చెందిన బాబు ఆరు సంవత్సరాల క్రితం కోకో కోల కంపెనీలో పని చేయడానికి కువైట్ దేశం వెళ్లాడు. తాను ఉంటున్న రూమ్‌లోని బాత్రూంలో కాలుజారి కింద పడ్డాడు. గమనించిన తోటి సిబ్బంది అతనిని చికిత్స కోసం స్థానిక హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బాబు మృతి చెందాడు. మృతుడికి భార్య నవిత, ముగ్గురు కుమారులు హర్షిత్, వినిష్ కుమార్, విజిత్ కుమార్ ఉన్నారు. బాబు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటున్న



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 16వ వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలపై వెంటనే స్పందిస్తున్నట్లు కౌన్సిలర్ భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు అభివృద్ధి చేశామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో ఇంత అభివృద్ధి జరిగిందని ఆమె గుర్తు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు గజ్వేల్ అభివృద్ధిపై దృష్టి పెట్టడం వల్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. వార్డులో కొంత భాగం సిసి రోడ్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వార్డులో కొన్ని బస్తీలు, సిసి రోడ్లు పూర్తి చేసేది ఉందని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని ఆమె గుర్తు చేశారు. మహిళలు తాగునీరు కోసం అనేక దశాబ్దాలు గోసపడ్డారని ఆమె అన్నారు. గజ్వేల్ నుంచి కేసీఆర్ గెలిచి మహిళల గోసా చూడలేక మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించినట్లు ఆమె అన్నారు. గజ్వేల్ మండలం కోమటి బండ వద్ద మిషన్ భగీరథ ప్లాంట్ ఏర్పాటు చేసి ఇంటింటికి తాగునీరు అందిస్తున్నారు. ఈ విషయంలో కెసిఆర్ ను ప్రజలు మరువలేనని ఆమె అన్నారు. మహిళా సంక్షేమానికి కేసీఆర్ కృషి చేసినట్లు ఆమె అన్నారు.

నాణ్యమైన దర్యాప్తు చేయాలి



జిల్లా ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో (అండర్ ఇన్వెస్టిగేషన్) ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో నాణ్యమైన దర్యాప్తును త్వరిత గతిన పూర్తి చేయాలి. నేరస్తులను న్యాయస్థానం ముందు హాజర్చాలని జిల్లా ఎస్పీ రూపేష్ పోలీసు అధికారులకు సూచించారు. మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పటాన్‌చెర్వు సబ్-డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేస్తూ, కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. అత్యాచార కేసులలో నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే తిరిగి అలాంటి నేరాలు చేయడానికి వెనకడుగు వేస్తారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. దాబాల వద్ద, పెట్రోల్ పంప్‌ల వద్ద సీసీ కామెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. మోటార్ సైకిల్ నడిపే వ్యక్తితో పాటు వెనకాల కూర్చున్న వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో పటాన్ చెర్వు ఇంచార్జ్ డియస్పి బాలాజీ, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ బి.రమేష్, ఐ.టి.సెల్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, పటాన్ చెర్వు సబ్ డివిజన్ సి.ఐ.లు, యస్.ఐ.లు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం



- మొక్కుబడి తనిఖీలు • జిన్నింగ్, రైస్ మిల్లుల్లో అదనపు తూకం • తూకం దోపిడీతో పత్తి, ధాన్యం రైతులకు నష్టం
- పెట్రోల్ బంకుల్లో మీటర్ సెట్టింగ్ • సూపర్‌మార్కెట్లు, దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాంటాల్లో మోసం
- శిథిలావస్థలో తూనికలు, కొలతల జిల్లా కార్యాలయం • మూడు పోస్టులకు ఒకే అధికారి • పర్యవేక్షణ పట్టని వైనం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తూనికల్లో కొలతల మోసాలకు అడ్డుకట్ట వేసే నాథుడే కరువైయ్యాడు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి తూకం.. రైస్ మిల్లుల్లో ధాన్యం, బియ్యం కాంటా వేసే విషయంలో అదనపు తూకం వేస్తూ రైతుల్ని దోపిడీ చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో మీటర్ రీడింగ్‌లో సెట్టింగ్ చేస్తూ వాహనదారుల్ని దోచుకుంటున్నారు. సూపర్ మార్కెట్లు, కిరాణం, మటన్, చికెన్, కూరగాయల దుకాణాలు, ఇతర మార్కెట్ల లో ఎలక్ట్రానిక్ కాంటాలతో మోసాలకు పాల్పడుతూ వినియోగదారుల్ని లూటీ చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వందలాది వే బ్రిడ్జిల్లోనూ మోసాలు జరుగుతున్నాయి. తూనికలు, కొలతల్లో మోసాలు జరగకుండా అరికట్టాల్సిన జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మొక్కుబడి తనిఖీలు తప్ప తప్పుడు తూకాలు వేసి మోసాలకు పాల్పడుతున్న వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నది లేదు. పైగా అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నట్లు విమర్శలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన పోస్టులకు ఒకే ఒక అధికారి బాధ్యతలు చూస్తుండడంతో పర్యవేక్షణ గాలికి వదిలేసినట్లైంది. జిల్లా కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కార్యాలయానికి అధికారి ఎప్పుడు వస్తారో కూడా తెల్వని పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి తూనికలు, కొలతల్లో జరుగుతున్న మోసాల్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా తూకం దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ప్రత్యేకంగా తూనికలు, కొలతల అధికారులున్నప్పటికీ పర్యవేక్షణ లోపం వల్ల తనిఖీల్ని గాలికి వదిలేశారు. పంట దిగుబడులు వచ్చే సీజన్‌లో జరుగుతున్న తూకం మోసాల్ని అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ధాన్యం, పత్తి దిగుబడులు వస్తుండడంతో రైస్, జిన్నింగ్ మిల్లుల్లో తూకాలేస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఒక బస్తాలో 41 కిలోల 50 గ్రాముల ధాన్యం మాత్రమే తూకం వేయాలి. కానీ..! మూడు జిల్లాల్లోని అన్ని కేంద్రాల్లోనూ 42 కిలోల 200 గ్రాముల వరకు తూకం వేస్తూ రైతుల్ని దోపిడి చేస్తున్నారు. ఒక రైతు వంద బస్తాల ధాన్యం అమ్మితే క్వింటాల్ ధాన్యం తరుగుగా పోతుంది. అంటే క్వింటాల్‌కు రూ.2200 వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఇలా మూడు జిల్లాల్లో అదనపు తూకం వల్ల లక్షలాది మంది రైతులు కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. అదే విధంగా రైస్ మిల్లుల్లో వే బ్రిడ్జ్‌ల్లో లారీల్లో తెచ్చిన ధాన్యాన్ని తూకం వేసే విషయంలోనూ మోసం చేస్తున్నారు. తక్కువ కొలతలు చూపి దోపిడికి పాల్పడుతున్నారు. రైస్‌మిల్లుల్లో బియ్యం బస్తాల్లో కూడా 50 కిలోలు కాకుండా 48 కిలోల లోపే నింపి ప్యాకింగ్ చేస్తూ వినియోగదారుల్ని దోపిడి చేస్తున్నారు. మూడు జిల్లాల్లో వందలాది రైస్‌మిల్లుల్లో ఇదే తీరు కొనసాగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవట్లేదనే అభిప్రాయముంది. ఇక పత్తి కొనుగోళ్లు చేస్తున్న జిన్నింగ్ మిల్లుల్లో కూడా కాంటా వేసే విషయంలో కొలతల్లో మోసాలకు పాల్పడుతున్నారు. రైతులు తెచ్చే పత్తిని తూకం వేసేటప్పుడు ఎక్కువ సరును తక్కువగా చూపిస్తున్నారు. ట్రాక్టర్ లోడ్ పత్తిలో క్వింటాల్‌కుపైగానే దోచుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. జిన్నింగ్ మిల్లులో తప్పుడు తూకం వేస్తూ మోసం చేస్తున్నారని రైతులు ఆందోళన చేస్తున్నారు.

పెట్రోల్ బంకుల్లో అదే తీరు

మూడు జిల్లాల్లో వందల సంఖ్యలో పెట్రోల్ బంకులున్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ఉన్న బంకుల్లో నిత్యం లక్షలాది లీటర్లల్లో పెట్రోల్, డిజీల్ విక్రయాలు సాగుతున్నాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ బంకుల్లో విక్రయాలు అధికంగానే ఉన్నాయి. బంకుల్లో ఉన్న మీటర్ రీడింగ్‌లో ప్రయివేట్ ఆపరేటర్ల ద్వారా ముందే సెటింగ్ చేయిస్తున్నారు. వాహనదారులకు జీరో చూసుకొమ్మని చెబుతున్నా పంపు ఆపరేటింగ్‌లోనే మోసానికి పాల్పడుతూ ప్రతి లీటర్‌కు 100 మిల్లీ లీటర్ల వరకు తక్కువ పోస్తున్నారు. అయినా తూనికలు, కొలతల అధికారులు పట్టించుకోవట్లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు, లారీలు, పెద్ద వాహనదారుల్ని తప్పుడు తూకాలతో మోసం చేస్తున్న పరిస్థితిని అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ పెట్టి అన్ని బంకుల్లో మీటర్ రీడింగ్‌ను తనిఖీ చేసి లోపాల్ని గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సూపర్‌మార్కెట్లు, కిరాణం, మటన్, చికెన్, కూరగాయలు, వ్యవసాయ మార్కెట్లు, చేపల మార్కెట్లు ఇలా ప్రతి చోటా ఎలక్ట్రానిక్ కాంటాలొచ్చాయి. బాట్లు పెట్టి తూకం వేసే పరిస్థితి పోయింది. ఎలక్ట్రానిక్ కాంటాల్లో నెంబర్లు సెటింగ్ చేసి ఎక్కువ తూకం వచ్చేట్లు చూస్తున్నారు. కొను గోలు చేసే సరుకుల తూకాల్లో మోసాలు జరుగుతున్నా పట్టింపులేదు. ఏదో ఒక చోట తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కిలో అరకిలో, పావు కిలో బాట్లు పోయి నెంబర్లు చూసుకోవాల్సి వస్తుంది. వినియోగదారులు ఆత్రుతగా సరుకులు తీసుకోజూస్తున్నందున కాంటాల్లో జరిగే మోసాల్ని సైతం గమనించట్లేదనే చెప్పాలి. గమనించినా కాంటాల్లో చేసిన సెటింగ్ గురించి టెక్నికల్ అవగహనా లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. వేబ్రిడ్జ్‌లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, పెట్రోల్ బంకుల్లో మీటర్ రీడింగ్‌లలో మోసాలకు పాల్పడకుండా ఉండేందుకు రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలి. వాటిల్లో ఏవైనా లోపాలుంటే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. కేసులు పెట్టి జరిమానాలు విధించాలి. ఇందు కోసం ప్రత్యేకంగా మూడు జిల్లాల్లోనూ జిల్లా, డివిజన్ స్థాయిలో తూనికలు, కొలతల శాఖ కార్యాలయాలున్నాయి. జిల్లాకో అధికారి, డివిజన్ స్థాయిలో ఇన్స్పెక్టర్లు ఉన్నారు. ఆఫీసుల్లో టెక్నికల్ స్టాఫ్ కూడా ఉంటుంది. వీరంతా టీమ్‌గా వెళ్లి కాంటాల్ని తనిఖీ చేయాలి. నిరంతరం పర్యవేక్షించాలి. ఫిర్యాదులు రాకపోయినా నిరంతరం నిఘా కొనసాగించాలి. కానీ..! అధికారులు మాత్రం ఏమైన ఫిర్యాదు వస్తేనే వెళ్తున్న పరిస్థితి ఉంది. తనిఖీలకు వెళ్లినా పైపైన చూసి వస్తున్నారు. జిన్నింగ్, రైస్ మిల్లులు, పరిశ్రమలల్లో ఉన్న వేబ్రిడ్జ్‌ల్లో జరిగే మోసాలను అరికట్టకుండా యజమానులు ఇచ్చే మామూళ్లతో అంతా సరిగ్గా ఉన్నట్లు ధృవీకరిస్తున్న పరిస్థితి ఉంది. సంగారెడ్డి జిల్లాలో తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారినే సంగారెడ్డి, జహీరాబాద్ ఇన్స్పెక్టర్ బాధ్యతల్ని కూడా చూస్తున్నారు. ముగ్గురు అధికారులు పనిచేయాల్సిన చోట ఒకే అధికారి ఉండడం వల్ల జిల్లా అంతటా పర్యటించి తనిఖీలు చేయడం వీలుకాని పరిస్థితి ఉంది. పైగా జిల్లా కార్యాలయం శిథిలావస్థకు చేరింది. అందులోనే కార్యాలయం కొనసాగిస్తున్నారు. కార్యాలయంలో కనీసం నీటి వసతి, టాయిలెట్స్ కూడా లేవు. అయినా అక్కడే కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సముదాయంలోకి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు నిరంతరం: అనిల్‌కుమార్, జిల్లా అధికారి

తూనికలు, కొలతల్లో తప్పులు జరగకుండా తనిఖీలు చేస్తున్నాం. పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా తప్పులు జరుగుతున్నట్లు గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఎవర్నీ ఉపేక్షించట్లేదు. మోసాలకు పాల్పడుతున్న తెలిస్తే తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

కార్మిక సంక్షేమం కోసం

సీఐటీయూ నిరంతర పోరాటం

మహేంద్ర ట్రాక్టర్స్ ఎన్నికల గేట్ మీటింగ్‌లో మహీంద్ర ట్రాక్టర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ జహీరాబాద్

కార్మిక సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. గురువారం మహేంద్ర ట్రాక్టర్స్ ఎన్నికల గేట్ మీటింగ్కు చుక్క రాములు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేంద్ర ట్రాక్టర్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి సీఐటీయూ గతంలో అనేక పోరాటాలు చేసి సాధించిందని గుర్తు చేశారు. కార్మిక సమస్యల పరిష్కారానికి సీఐటీయూను గెలిపించాలని కోరారు. 'టీఆర్టీయూ నాయకులు యాజమాన్యానికి తొత్తుగా మారి కార్మికులకు ఛార్జ్‌షీట్స్ ఇస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ రెండు సంవత్సరాలు పాలించారు. అలాంటి వారిని ఓడించి సీఐటీయూను గెలిపిస్తే మెరుగైన సౌకర్యాలు సాధించి పెడతాం' అని అన్నారు. కార్మిక చట్టాలు, కార్మిక సమస్యలపై ఎర్రజెండాకు మాత్రమే అవగాహన ఉన్నదన్నారు. ఏ మాత్రం అవగాహన లేని నాయకులు యాజమాన్యాల మెప్పుకోసం పని చేసి కార్మికులకు నష్టం చేస్తున్నారని అన్నారు. కార్మికులను ఎన్నికల ముందు మభ్యపెట్టి వారి ఓట్లను దండుకొని తర్వాత హక్కులను యాజమాన్యం వద్ద తాకట్టు పెట్టడమే వారి లక్ష్యమన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ట్రాక్టర్ ప్లాంట్ కార్మికులు గుర్తించారన్నారు. కార్మిక హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ముందుండి పోరాడుతోందన్నారు. యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను గెలిపిస్తే... అనేక కొత్త అంశాలు తీసుకొస్తామన్నారు. డీఆర్టీయూ సమయంలో వచ్చిన ఛార్జ్‌షీట్ల సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసి చారిత్రాత్మక వేతన ఒప్పందం చేసిన ఘనత సీఐటీయూకే ఉందన్నారు. సమావేశంలో నాయకులు మహిపాల్, రాజిరెడ్డి, వంశీ, బాబు వివిధ పరిశ్రమల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్‌హెచ్ జీ రుణాలు రూ.599.57 కోట్లు మంజూరు

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవ తెలంగాణ సిద్దిపట కలెక్టరేట్

జిల్లాలో ఎస్‌హెచ్‌జీ రుణాలు రూ.743.68 కోట్లకుగాను రూ.599.57 కోట్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. మండలాలవారీగా ఇచ్చిన టార్గెట్ ఈ నెల చివరి వారం వరకు అధికారులు పూర్తి చేయాలన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని మండలాల ఎంపిడిఒ, ఎంపిఓ, ఎపిఓ, ఎపిఎం, మున్సిపల్, ప్రభుత్వ ప్రవేటు గ్రామీణ బ్యాంక్ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. డీఆర్డీఏ సంబంధించిన సెర్ప్ బ్యాంక్ లింకెజ్ ప్రొగ్రెస్ మండలాలవారీగా డీఆర్డీఓ, ఎపిఎమ్, ఎల్డిఎం, అన్ని బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా ద్వారా ఎస్ఎచ్‌జీ రుణాల టార్గెట్ రూ.49.65 కోట్లకు గాను ఎక్కువ మొత్తంలో టార్గెట్ రూ.61.31 కోట్లు పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. వీధి వ్యాపారుల రూణాలను రెండు, ముడో లింకెంజ్ రుణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, గర్‌గర్ కిసాన్ క్రెడిట్ కార్డు అభియాన్ గుర్చీ బ్యాంకర్ల ద్వారా అన్ని గ్రామాల్లో కిసాన్ క్రెడిట్ కార్డు, పిఎంజెడివై, కెసిసి, పాడిపరిశ్రమ, మత్స్య కారులకు అందించే రుణాలు తీసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల ద్వారా సురక్ష జీవన్ జ్యోతి బీమా పథకాలు, ఎపివై పింఛన్ల పథకాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ, ఎంపిఓ, ఎపిఓ అధికారులతో వివిధ అజెండాలవారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వచ్చే వానకాలం నాటికి హరితహారం కార్యక్రమానికి సంబంధించి నర్సరీలలో మొక్కలు పెంచాలన్నారు. విధులలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి జయదేవ్ ఆర్యా ఎల్డిఎం సత్యజిత్, జెడ్పీ సీఈఓ రమేష్, డిపిఓ దేవకి దేవి మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ జోగిపేట

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని రెండో అంతస్తులో గల తన కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. దామోదర్ సతీమణి పద్మిని, కూతురు త్రిష ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సచివాలయానికి తరలివెళ్లారు. ఆయనకు శాలువా, పూలమాలలు పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. జోగిపేట మాజీ మార్కెట్ చైర్మన్ పద్మనాభ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్. కృష్ణారెడ్డి, ఎన్నికల ఏజెంట్ డాక్టర్ వీరన్న, కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, అకుల చిట్టిబాబు, రంగ సురేష్, డి.శంకర్, హరికృష్ణాగౌడ్, నాగరాజు, దుర్గేష్, చందర్, కోఆప్షన్ సభ్యులు అల్లె శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు డీ.వెంకటేశం,పి. ప్రవీణ్, హనుమాన్లు, సంగమేశ్వర్, శివరాజ్, కిషన్, రమేష్ జ్యోషి, జగన్ రెడ్డి, రాంరెడ్డి, మాణిక్యంగౌడ్, రాజశేఖర్, రాజిరెడ్డి, అశోక్, రఘు, ప్రేమ్ కుమార్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

రైతు సంఘం నాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపెల్లి సత్తిరెడ్డి డిమాండ్



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

రైతు సంఘం నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపెల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఎస్‌కెఎం జాతీయ నాయకులు యుద్వీర్ సింగ్, రైతు నాయకులపై ప్రభుత్వం అక్రమంగా నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని, యద్వీర్ సింగ్ ప్రయాణాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా రాష్ట్రపతికి జిల్లా కలెక్టర్ల ద్వారా విజ్ఞాపన పత్రం అందజేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో రెహమాన్‌కు సయుంక్త కిసాన్ మోర్చా (ఎస్ కె.ఎం) సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపెల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ గతంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు నాయకులపై బనాయించిన అక్రమ కేసులను భేషరతుగా ఎత్తివేయాలని కోరారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సంస్కరణ బిల్లును ఎత్తివేయాలన్నారు. మోడీ లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన హామీలను సైతం తుంగలోతొక్కి రైతాంగంపై మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారెపు తిరుపతి రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు బద్దిపడిగే కృష్ణా రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయు సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయం వద్ద గ్రామీణ తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చొప్పరి రవి కుమార్ మాట్లాడుతూ 2016వ సంవత్సరంలో 7వ పే కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా కమల చంద్ర కమిషన్ వేశారన్నారు. ఆ కమిషన్ చేసిన అధ్యయనంలో కార్మికుల సేవలను గుర్తించిందని తెలిపారు. ఆ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం దాచి చోద్యం చూస్తోందన్నారు. తక్షణమే ఆ రిపోర్ట్ను బహిర్గతం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగ భద్రత, 8 గంటల పనితో పాటు అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. కార్పొరేట్ వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. 65 సంవత్సరాల ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ ప్యాకేజీ రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం రూ.ఐదు లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, జనార్ధన్, ఆంజనేయులు, తిరుపతి రెడ్డి నాంపల్లి, రంగాచారి, ఎల్లయ్య మీన, శ్రీలత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణంలో జరుగుతున్న వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, వైకుంఠధామంతో పాటు ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ గురువారం చేర్యాల పట్టణంలో పర్యటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో పట్టణంలో జరుగుతున్న శానిటేషన్, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న వైకుంఠధామం, వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన నిర్మాణాలు చేర్యాల పట్టణంలో జరుగుతున్నాయని, వాటిని త్వరగా నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు మరింత చొరవ చూపాలన్నారు. నాణ్యతతో కూడిన నిర్మాణాలను జనవరి మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించి చేర్యాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మున్సిపాలిటీ ద్వారా పౌరులకు అందించే సేవలను నిర్ణీత సమయానికి అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, ఏఈ శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కళ్యాణ్ చక్రవర్తి, మేనేజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో నిర్వాసిత రైతు మృతి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు పెండ్యాల సారయ్య (45) బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. అతని భార్య ఎల్లవ్వ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెండ్యాల సారయ్య కు సంబంధించిన భూమి గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైంది. ఆ భూమికి వచ్చిన ప్యాకేజీతో తన కూతురు వివాహం చేశాడు. ఆయనకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ వర్తించకపోవడంతో మళ్లీ భూమి కొనుగోలు చేయడానికి డబ్బులు లేక, చేయడానికి ఏ పని లేక అప్పుచేసి ఆటో కొనుక్కొని నడుపుతున్నారు. వ్యవసాయం చేసుకునే ఆయన చివరికి ఆటో నడుపుకునే పరిస్థితి రావడంతో తీవ్ర మనోవేదనకు గురైన సారయ్యకు గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఏ ఆధారం అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల గొంతుక తీన్మార్ మల్లన్న



నవతెలంగాణ-మునిపల్లి

'ప్రజల పక్షాన పోరాడి అనేకసార్లు జైలుకు కూడా వెళ్లిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్‌యాదవ్ అన్నారు. గురువారం ఓ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దపెద్ద మీడియా సంస్థలు చేయని సాహసం తీన్మార్ మల్లన్న ప్రజల గొంతుకై న్యాయ పోరాటం చేశారని అన్నారు. అలాంటి వ్యక్తిని గుర్తించి ప్రభుత్వం అతనికి ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సీటు కేటాయించాలి' అని రమేష్‌యాదవ్ కోరారు. తీన్మార్ మల్లన్న ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోరాడుతున్నారని తెలిపారు

జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్



నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో దివ్యాంగుల క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని తన చాంబర్లో దివ్యాంగులకు జిల్లాస్థాయిలో క్రీడా పోటీల నిర్వహణపై మహిళ శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలను సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పోటీలలో ఐదు గేమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. జూనియర్ కేటగిరీలో 10 నుండి 16 సంవత్సరాల వయస్సువారు, సీనియర్ కేటగిరిలో 17 సంవత్సరాలు, ఆపై వయస్కులు(బదిరులు, అంధులు, శారీరక, మానసిక వైకల్యంగల దివ్యాంగ మహిళలు, పురుషులు) పాల్గొనవచ్చని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన స్పోర్ట్స్ మెటీరియల్ అందించడంతో పాటు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి రామ్ చందర్ రావుకు సూచించారు. ఈ క్రీడా పోటీలలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్య, పట్టణ, మండల వికలాంగుల సమాఖ్య, జిల్లా సమాఖ్యల సహకారంతో ఆయా సంఘాలలోని దివ్యాంగులు క్రీడా పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పిడి శ్రీనివాసరావుకు, మెప్మా పీడీ గీతకు సూచించారు. 10-16 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులైన పాఠశాల విద్యార్థులను ఇట్టి క్రీడా పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని, క్రీడా పోటీల నిర్వహణకు పీఈటీలను డిప్యూట్ చేయాలని విద్య శాఖ అధికారికి సూచించారు. క్రీడా పోటీల నిర్వహణ రోజు సంబంధిత గ్రౌండ్లో డాక్టర్ తో పాటు మెడికల్ టీం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. క్రీడా పోటీల నిర్వహణకు అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో పూర్తి స్థాయిలో శానిటేషన్ చేయించాలని, తాగునీరు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. సంబంధిత క్రీడా పోటీల నిర్వహణ షెడ్యూల్ ఖరారు చేసి ప్రణాళికతో క్రీడా పోటీలు నిర్వహించాలని, అదేవిధంగా క్రీడాకారులకు భోజన ఏర్పాట్లు చేయాలని డీడబ్ల్యూఓకు సూచించారు. నెహ్రూ యువ కేంద్రం, డిగ్రీ కళాశాలల వారికి, యువజన సంఘాల వారికి క్రీడా పోటీల నిర్వహణ సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. క్రీడా పోటీలు సజావుగా విజయవంతంగా జరిగేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో డీడబ్ల్యూఓ సంధ్యారాణి, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీఈఓ వెంకటేశ్వర్లు, యువజన క్రీడల అధికారి రామచందర్ రావు, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గాయత్రీ దేవి, మెప్మా పీడీ గీత, మున్సిపల్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని తిరుపతిలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మర్కుక్

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ సీహెచ్ రాజేశ్వరరావు (రాజురావు) గురువారం తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.రాజు, కె.శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు మెమోలు జారీ

నవతెలంగాణ-మునిపల్లి

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం లేదని పేర్కొంటూ మండలంలోని తాటిపల్లి గ్రామస్తులు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరగా తాటిపల్లి గ్రామస్తుల నుండి ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, సంబంధిత ఉపాధ్యాయులను సంజాయిషీ కోరుతూ చర్య తీసుకుంటామని, వారికి మెమోలు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు.

- గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి
- సదాశివపేట మండల సర్వసభ సమావేశంలో సర్పంచుల డిమాండ్





నవతెలంగాణ- సదాశివపేట

మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సదాశివపేట మండల సర్పంచుల, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. గురువారం సదాశివపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తొంట యాదమ్మ అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు తమ గ్రామాల సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో ఆస్తి మార్పిడి జరగడంలేదని, చనిపోయిన వ్యక్తుల పేర్ల మీదనే ఆస్తి పనులు చెల్లించడం జరుగుతుందని కోల్కూర్ సర్పంచ్ భూపాల్ రెడ్డి అన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాల సమస్యలను పరిష్కరించాలని ఆరూర్ ఎంపీటీసీ అల్లం లలిత, మద్దికుంట ఎంపీటీసీ మమత, ఆత్మకూరు సర్పంచ్ గంగయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో గ్రామాల్లో బస్ సర్వీస్‌లను పెంచాలని నిజాంపూర్ ఎంపీటీసీ మాధవరెడ్డి పేర్కొన్నారు. యాసంగికి సంబంధించిన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ అనిత తెలిపారు. వరి ధాన్యాన్ని మూడు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, ఇప్పటివరకు 527 మెట్రిక్ టన్నుల వారి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుబంధు ద్వారా 25 వేల 364 మంది రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీడీవో పూజ, డిప్యూటీ తాసిల్దార్ వీరేశం, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



నవతెలంగాణ - ఝరాసంగం

స్వామియే శరణం అయ్యప్ప. స్వామియే శరణం అయ్యప్ప అనే నామస్మరణంతో కేతకీ ఆలయ ఆవరణ మారుమోగింది. గురువారం కేతకీ ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామి మహా పడి పూజను ఘనంగా నిర్వహించారు. మొదట ఆలయంలో సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్ప స్వాములు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. 18 మెట్లను ఏర్పాటు చేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. స్వామి వారిని భాజబజంత్రీల మధ్య పల్లకీలో ఆలయం ముందు నుంచి ఊరేగించారు. గురు స్వాములు శ్రీశైలం, ముదిరాజ్ సంగన్న ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు కిషన్ సింగ్, జగన్, నరేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

ఖేడ్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మండ లం ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోరుతూ గురు వారం ఆర్డీఓ కార్యాల య సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సాయిరెడ్డి మాట్లాడు తూ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు చాందీ బాయి రామచందర్ చౌహాన్ బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలుపొంది.. పదవి ఉండగానే ఇతర పార్టీలో చేరానని తెలిపారు. ఖేడ్ మండలానికి చెందిన వివిధ గ్రామాల ఎంపీటీసీలు 12 మందితో కలిసి ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్షన్ సభ్యులు నవాబ్, భూపాల్, సుజాత, స్వప్న, లక్ష్మీ అశోక్ రెడ్డి, రాజు, సునీత జాదవ్, జగదేవి.శ్రీనివాస్ వారితో పాటుగా జడ్పీటీసీ భర్త రవీందర్ నాయక్, ఎస్సీ. ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మెంబర్ రాజు, మల్గొండ కూర్మ సంఘం ఖేడ్ నియోజక వర్గం ఉపాధ్యక్షుడు, మరియు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవ తెలంగాణ- సిద్దిపేట

సిద్దిపేట మున్సిపాలిటీ, సిద్దిపేట అర్బన్ మండలం, సిద్దిపేట రూరల్, నారాయణరావు పేట్ మండలాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 15న ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. 220 కె.వి/132 కె.వి సిద్దిపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలలో తనిఖీలు



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్యాస్ అక్రమ రీఫిలింగ్ కేంద్రాలపై గురువారం పోలీసులు దాడి చేవారు. సీఐ నయీముద్దీన్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాలలో గ్యాస్ అక్రమ రీఫిలింగ్ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గత రెండు రోజుల క్రితం బొల్లారం పారిశ్రామిక వాడలో జిల్లా ఎస్ఓటి అధికారులు, సివిల్ సప్లై అధికారులతో కలిసి విశ్వసనీయ సమాచారం మేరకు పెద్ద ఎత్తున అక్రమంగా రీఫిల్లింగ్ దందా చేస్తున్న కేంద్రాలలో దాడులు నిర్వహించి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ రీఫిలింగ్ చేపడితే కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి అభినందనలు



నవతెలంగాణ-మునిపల్లి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన దామోదర్ రాజనర్సింహను సంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల ఫోరం సంఘం ఉపాధ్యక్షుడు బుర్కల పాండు కలిసి అభినందనలు తెలియజేశారు. నియో జకవర్గ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు పాండు పేర్కొన్నారు .

ఆత్మ పరిశీలన చేసుకుంటాం

- మళ్లీ అధికారంలోకి వస్తాం
- మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ చిలకమర్రి నరసింహ



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

75 సంవత్సరాలలో జరగని అభివృద్ధి పది సంవత్సరాలలో రూ.లక్షల కోట్ల అభివృద్ధి జరిగిందని మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ చిలకమర్రి నరసింహ అన్నారు. నారాయణఖేడ్ ఐబీలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కొందరు నాయకుల కారణంగా టీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని, కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. 14 సంవత్సరాల పోరాటంతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడానికి కొందరు కబ్జాకోరులు, దగుల్బాజీ నాయకులు కారణమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, నిరుద్యోగులు, మిగతా వర్గాల సమస్యలను పరిష్కరించకపోవడంతో అధికారం కోల్పోవడం జరిగిందని అన్నారు. వాటిని ఆత్మ పరిశీలన చేసుకొని మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని నాగేశ్వర్ కాలనీలో గల అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం సూపర్వైజర్ దేవా కృప సందర్శించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, తల్లులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు బాలామృతం తినిపించాలన్నారు. పరిశుభ్రత పాటించాలన్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు రాసుకోవాలని టీచర్‌కు ఆయాకు సూచించారు. కార్యక్రమంలో బాలింతలు గర్భవతులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి

- బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు వినోద్ కుమార్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాబోయే పంచాయతీ ఎన్నికలకు బీఎస్పీ కార్యకర్తలు సంసిద్ధం కావాలని సంగారెడ్డి నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షులు ఎం .వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసేందుకు బీఎస్పీ కార్యకర్తలంతా బూత్ స్థాయి నిర్మాణాలు చేయాలని అన్నారు. గ్రామాలలో ప్రభుత్వం కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా కొంతమంది దోచుకున్న విషయాలను బయటికి తీయాలని, వారిపై విచారణ జపించాలని ఎంపీడీవో రెవెన్యూ డివిజన్ అధికారులను డిమాండ్ చేశారు. సంగారెడ్డి నియో జకవర్గంలోని అన్ని గ్రామాలలో పోటీకి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మహనీయుల ఆశయాల సాధన కోసం, సుపరి పరిపాలన కోసం, గ్రామాల అభివృద్ధికై బీఎస్పీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలను రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లాఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్



నవతెలంగాణ-కంగ్టి

మండల కేంద్రమైన కంగ్టిలోని లిటిల్ స్టార్ ప్రయివేట్ పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పిల్లల తల్లిదండ్రుల వద్ద అధికఫీజులు వసూలు చేస్తోందని ఆరోపిస్తూ గురువారం తహసీల్దార్ విష్ణుసాగర్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూన్నారని ఆరోపించారు. పాఠశాల నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని వాపోయారు. విద్యార్థులకు ఆడు కోవడానికి అట స్థలం లేదన్నారు. భవనం కింద దుకాణాల చుట్టూ ఆడుకుంటున్నారని అన్నారు. పాఠశాలకు దగ్గరలో రోడు ఉండడంతో పిల్లలకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ పాఠశాల ఎంఈవో కనుసన్నలోనే కొనసాగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి, శ్రీకాంత్, ఉపాధ్యక్షులు ప్రశాంత్ , ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

• ఎమ్మెల్యే సంజీవరెడ్డికి సర్పంచ్ వినతి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మినీ స్టేడియంను మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి సర్పంచ్ అలుగుల సత్యనారాయణ వినతి పత్రం సమర్పించారు. పెద్ద శంకరంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వసతులు, పడకలు లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థిని విద్యార్థులు దూరప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పెద్ద శంకరంపేటలో 30 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని సర్పంచ్ సత్యనారాయణ కోరారు.

బీఎల్ఓలతో సమావేశమైన ఆర్డీఓ

నవతెలంగాణ-నిజాంపేట



మండల తహశీల్దార్ కార్యాలయంలో మెదక్ ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్ మండల బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని, అలాగే చనిపోయిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సురేష్ కుమార్, ఆర్ఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

16న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని ఈ నెల 16వ తేదిన నిర్వహించనున్నామని ఆ సంఘ మండల అధ్యక్షులు ఎస్ నర్సింలు తెలిపారు. 17న పెన్షనర్స్ డేని పురస్కరించుకొని ఒకరోజు ముందుగా ఈ సమావేశాన్ని అనివార్య కారణాలవల్ల జరిపిస్తున్నామన్నారు. సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోలీస్ అధికారులకు 16న శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి

పోలీస్ అధికారులు, జువెనైల్, శిశు సంక్షేమ అధికారులకు ఈ నెల 16న శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి జె. హనుమంతరావు తెలిపారు. డిసెంబర్ 16న ఉదయం 10 గంటలకు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అధ్యక్షతన కోర్టు ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నామని హనుమంతరావు తెలిపారు.

ఎస్పీ రూపేష్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్‌ను టీఎన్‌జీవో ప్రతినిధి ఎండి జావీద్ అలీ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకుగాను వారు ఎస్పీ రూపేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా 2024 డైరీ ముద్రణకుగాను ఎస్పీ సందేశాన్ని వారు కోరారు. జిల్లాలో ఉన్న టీఎన్జీవోస్ భవనాలను, టీఎన్జీవోస్ ఆస్తులను కాపాడాలని వారు కోరడంతో ఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, పి.వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, కేంద్ర సంఘం మహిళా కార్యదర్శి నిర్మలా రాజకుమారి, కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖాజా గౌస్ హష్మీ , విజయ్, శ్రీనివాస్, కొండల్, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో జహీరాబాద్ బిడ్డ స్టాలిన్



నవతెలంగాణ-జహీరాబాద్

గద్వాలలో ఈ నెల 15వ తేదిన జరగనున్న ఎస్జిఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జహీరాబాద్ కు చెందిన మొగుడంపల్లి స్టాలిన్ పాల్గొననున్నారు. పలు క్రికెట్ టోర్నమెంట్‌లలో పప్రతిభను కనబరుస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ జహీరాబాద్ బిడ్డ స్టాలిన్ రాష్ట్రస్థాయిలో టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ టోర్నమెంట్‌లో మంచి ప్రతిభను కనబర్చి జాతీయస్థాయి జట్టుకు ఎంపిక కావాలని మనందరం కోరుకుందాం. బెస్ట్ ఆఫ్ లక్ స్టాలిన్.

బీజేపీ అత్మీయ సమ్మేళనం

సమావేశానికి హజరైన మర్కుక్ బీజేపీ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

జగదేవపూర్ మండల కేంద్రంలో గురువారం బీజేపీ ముఖ్య కార్యకర్తల అత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో మర్కుక్, జగదేవపూర్‌పూర్ మండలాల నాయకులతో కలిసి అత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మర్కుక్ బీజేపీ ఇంచార్జి, మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు టి.రమేష్ గుప్తా, మర్కుక్ మండల బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి రెడ్డి, రాజాసింగ్, తదితరులున్నారు.

దుబ్బాకలో 30న జాతీయ లోక్ అదాలత్

సద్వినియోగం చేసుకోవాలని సూచన
న్యాయవాది పి.చందన



నవతెలంగాణ-దుబ్బాక/దుబ్బాక రూరల్

జాతీయ లోక్ అదాలత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జ్యుడీషియల్ దుబ్బాక మెజిస్ట్రిట్యూట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ న్యాయవాది పి.చందన సూచించారు. గురువారం దుబ్బాక కోర్టు హాల్లో దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, అక్బర్ పేట్ భూంపల్లి సర్కిల్ పోలీసులతో ఈ నెల 30న జరిగే జాతీయ లోక్-అదాలత్ కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా న్యాయవాది పి.చందన మాట్లాడుతూ ఈ నెల 30న దుబ్బాక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. వివిధ కేసులు ఉన్న వ్యక్తులు రాజీ మార్గంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమయం వృదా కాకుండ ఉంటుందన్నారు. ప్రభుత్వ న్యాయ చట్టాన్ని అందరూ గౌరవించి, నియమ నిబంధనలు పాటించాలన్నారు. అధికారుల సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. దుబ్బాకలో ఉన్న కేసులు పరిష్కారించేందుకు నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో దుబ్బాక ఎస్సైలు గంగరాజు, భువనేశ్వర్ రావు, నరేష్, లింగం, కోర్టు డ్యూటీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉల్లాసంగా దివ్యాంగుల క్రీడలు

• క్రీడలను ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్





నవతెలంగాణ-సిద్ధిపేట

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడోత్సవాలు గురువారం ఉల్లాస వాతావరణంలో జరిగాయి. క్రీడలను జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వికలాంగులు ఆడుతున్న క్రీడలను ఆమె పరిశీలించారు. క్రీడోత్సవాలలో అంధ, బదిర, శారీరక, మానసిక దివ్యాంగులకు రన్నింగ్, షాట్ పుట్, చెస్, జావలిన్ త్రో, క్యారంలలో జూనియర్, సీనియర్ కేటగిరీలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి, డివైఎస్ఓ నాగేందర్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, పీడీలు, పీఈటీలు శ్రీనివాసులు, వెంకటస్వామి, అశోక్, కనకయ్య, సుజాతలు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటర్ లీస్ట్‌ను సరి చేయాలి

• ఓటర్ లీస్ట్‌పై బీఎల్‌వోలకు అవగాహన
• నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్



నవతెలంగాణ-వెల్దుర్తి

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తప్పులు లేకుండా ఓటర్ లీస్ట్‌ను సరి చేసే బాధ్యత బూతు లెవెల్ అధికారులపై ఉందని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో తహసీల్దార్ తులసిరామ్ మాసాయిపేట తహసిల్దార్ నాగజ్యోతిలతో కలిసి నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ ఓటర్ లీస్ట్‌పై బీఎల్‌వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు తగు సూచనలు చేశారు. ఓటర్లు పేరు నమోదు కార్యక్రమం తొలగింపు వేరే ప్రాంతంకు మార్పు కోసం అభ్యర్థించే ఓటర్లను నమోదు ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ లీస్ట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఫామ్ 6 ద్వారా ఓటర్ లీస్టులో నమోదు చేసుకోవడానికి అవగాహన కల్పించాలన్నారు. ఫామ్ 7 ద్వారా చనిపోయిన వారిని, రెండు, లేదా అంతకంటే ఎక్కువ ఓటర్ లిస్ట్‌లో పేరు నమోదై ఉంటే తొలగించుట, ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ వేరే ప్రాంతంలో ఉన్నట్లయితే వారిని తొలగించుట గురించి వివరించారు. ఫామ్8 ద్వారా పేరు, వయసు, ఫోటో, ఇంటి నంబర్, సవరణ చేసుకోవచ్చున్నారు. ఒక పోలింగ్ బూత్ నుంచి మరో పోలింగ్ బూత్‌కు ఓటర్ లీస్ట్ నుంచి మార్చుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• సర్పంచ్ బడికోలు మాధవరెడ్డి

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



పశువులకు వచ్చే వ్యాధుల నివారణ కోసం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బడికోలు మాధవరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని పోతారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మాదవరెడ్డి, ఉపసర్పంచ్ వీరేశంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఎదకు రాని పశువులకు, గర్భకోశ వ్యాధి పశువులకు చికిత్సలను నిర్వహించారు. అలాగే లేగ దూడలకు నట్టల నివారణ మందులను తప్పకుండా వేయాలని దాంతో లేగ దూడలు దృఢంగా తయారవుతాయన్నారు. దాంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సూచించారు. ప్రతి ఒక్కరు ఇలాంటి ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బడికోలు ప్రభాకర్‌రెడ్డి, పశువైద్యధికారి లక్ష్మి, వార్డు సభ్యులు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, రాజారాం, మంజుల, చిరంజీవి, గోపాల మిత్ర రామస్వామి, చంద్రలేఖ పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధిని మరువలేం

నవ తెలంగాణ-గజ్వేల్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి మరువలేమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి రోడ్లు, పార్కులు, సుందరీకరణ పనులు చేపట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అభివృద్ధి అంటే కేసీఆర్ అని ప్రజలకు తెలిసి వచ్చిందన్నారు. ముఖ్యంగా తాగు, సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నీటి తిప్పల కోసం రాత్రింబవళ్ల కష్టపడ్డామని, 2016 నుంచి నీటి కష్టాలు తప్పినట్లు ఆయన గుర్తు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు చేయించినట్లు ఆయన తెలిపారు. 15వ వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువల పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పారిశుధ్య చర్యలు తీసుకుంటున్నామని వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా గజ్వేల్ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతోపాటు కేసీఆర్ గజ్వేల్ నుంచి ప్రాతినిధ్యం వహించడంతో ఇంత అభివృద్ధి జరిగిందన్నారు. గజ్వేల్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉండటం వల్ల మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను అనుసరించాలి

• సర్పంచ్ అలుగుల సత్యనారాయణ

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక గ్రంథమైన భగవద్గీతను చదివి అనుసరించాలని సర్పంచ్ అలుగుల సత్యనారాయణ అన్నారు. గురువారం పెద్ద శంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవచనాలు భక్తి భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అలుగుల సత్యనారాయణ వంద మందికి ఉచితంగా భగవద్గీత పుస్తకాలను అందజేశారు. జీవిత పరమార్థం తెలియజేసేది భగవద్గీత అని, ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివి తమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు రామాయణ, మహాభారతం, భగవద్గీత ఇతిహాసాలను చదివించడం అలవాటు చేయాలన్నారు. వీటివల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, ధర్మరక్షణ, నైతిక విలువలు పెంపొందించడం జరుగుతుందన్నారు. అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్ వారు గ్రామ గ్రామాన హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రచారం చేస్తూ మహాభారతంలో శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత గురించి అందరికీ వివరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు కోణం విట్టల్ శిశు మందిర్ ప్రధానాచార్యులు వీరప్ప, హిందూ సంఘాల బాధ్యులు సీతారామారావు, జైహింద్ రెడ్డి, ఎర్ర శ్రీహరి, శ్రావణ్ కుమార్, సతీష్ గౌడ్, సర్వేశ్వర్, రవి వర్మ శైలేష్, కాజిపల్లి సంతోష్ కుమార్, గాండ్ల సంగమేశ్వర్, అధిక సంఖ్యలో యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దత్తతపై బాలల శిశు సంరక్షణ కేంద్రాలకు శిక్షణ



నవతెలంగాణ-సంగారెడ్డి

దత్తతపైన సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 12 బాలల శిశు సంరక్షణ కేంద్రాలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, డబ్ల్యూఏఐసి స్వచంద సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలోని మహిళా ప్రాంగణంలో ఈ శిక్షణ కార్యకక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిడబ్ల్యుఓ. సంధ్యారాణి మాట్లాడుతూ శిశు సంరక్షణ కేంద్రాలు పిల్లలకు సంబంధించిన వివరాలన్ని దగ్గర పెట్టుకోవాలని వివరించారు. దత్తతకు అర్హత కలిగిన పిల్లల వివరాలు దత్తత పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. అందరూ కూడా జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2021 ప్రకారం శిశు సంరక్షణ కేంద్రాలు నడపాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మెన్ రాజారెడ్డి మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం ప్రకారం ప్రతి పిల్లవాడి వివరాలు సీఏఆర్ఏ వెబ్సైట్‌లో ఆన్లైన్‌లో ఉండాలన్నారు. సంగారెడ్డి జిల్లాలోని డీసీపీయూ యూనిట్ చాలా బాగా పని చేస్తుందన్నారు. కొద్ది రోజుల క్రిందట తప్పి పోయిన నలుగురు బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించడ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు విష్ణుమూర్తి, మెదక్ సీడబ్ల్యూసీ సభ్యులు ఉప్పలయ్య, డీసీపీఓలు రత్నం, కర్ణశీలతో పాటు రామకృష్ణ, లింగం, నాగరాజు,శిశు రక్షణ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

• ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి
• న్యాయవాది ప్రశాంత్

నవతెలంగాణ-మెదక్



మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపి ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని న్యాయవాది ప్రశాంత్ పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జోన్‌లో కొనసాగుతున్న మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా తీసుకొచ్చిన 317 జీవోను రద్దు చేయాలని కోరారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపుతూ ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిరంజీవి, శ్రీకాంత్, ఈశ్వర్, భాను, వెంకటేష్, హరికాంత్ తదితరులు ఉన్నారు.

23న జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మెదక్

మెదక్ జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఉదయం 11 గంటలకు స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేశామని జెడ్పీ సీఈవో శైలేష్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపిపి సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎర్త్ ఎడ్యుకేషన్ ఆర్ట్ హెల్త్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎర్త్ ఎడ్యుకేషన్ అర్ట్ హెల్త్ చేస్తున్న సేవలు అభినందనీయమని, రానున్న రోజుల్లో ఇలాంటి సేవలు మరిన్ని కొనసాగించాలని సిద్దిపేట జిల్లా డీఈవో ఇ. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎర్త్ ఎడ్యుకేషన్ అర్ట్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజు ఆధ్వర్యంలో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పాఠశాల సిబ్బందితో కలిసి డీఈవో శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల, ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ఎర్త్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. పాఠశాలలో విద్యార్థులు చక్కటి క్రమశిక్షణను అలవర్చుకొని సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదిగి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులంతా గొప్ప గొప్ప స్థానాల్లో ఉండి సేవలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కృష్ణవేణి, సరిత, వరలక్ష్మి, రమేష్ బాబు, సిరివెన్నెల, ఎర్త్ ఫౌండేషన్ సభ్యులు, కోఆర్డినేటర్ ఆంజనేయులు, డైరెక్టర్ వెన్నెల, పీఈటి ప్రశాంత్, మ్యాప్ కోఆర్డినేటర్ నిహారిక, ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ హరీష్ తదితరులున్నారు



పలు పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

అక్బర్ పేట భూంపల్లి మండలంలోని ప్రైమరీ స్కూల్స్ నగరం, తాళ్లపల్లి, ఎనుగుర్తిని పోతారెడ్డిపేటలోని రెండు ప్రాథమిక పాఠశాలలను గురువారం జిల్లా విద్యాధికారి ఈ శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం దుబ్బాక మండలంలోని రఘోత్తం పల్లి గోసాన్ పల్లి , అచ్చుమాయపల్లి , కమ్మరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను, టేకుల తాండ, శిలాజినగర్ హబ్సిపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి బడిలో ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
శుక్రవారం | 15 డిసెంబర్ 2023 | www.navatelangana.com

అన్ని రంగాల్లో ఏడో వార్డు అభివృద్ధి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో పలు అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని చెప్పారు. ఏడో వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టి వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. గజ్వేల్ అభివృద్ధి 30 సంవత్సరాల ముందుకు వెళ్లిందన్నారు. ఇంత అభివృద్ధి ఏ ప్రభుత్వంతో సాధ్యం కాదని తెలిపారు. వార్డు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు తెలంగాణ ప్రభుత్వంలో అందించినట్లు చెప్పారు. పెన్షన్స్ ఇతర కల్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ కెసిఆర్ కిట్టు లాంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ తన వార్డులో చాలామంది రైతులకు అందినట్లు గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి మరువలేనిదన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

టీపీటీఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం మండలంలోని వివిధ పాఠశాల లో నిర్వహించారు. గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ మాట్లాడుతూ తక్షణమే మూడు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. 13 జిల్లా ల దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల అధ్యక్షులు పాపగారి పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, దమ్మని మల్లయ్య, హఫీజ్, దయానంద్ వోటకారి శ్రీనివాస్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది.ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ తడిసిన ఉమా, వైస్ ఎంపీపీ రేణుక, ఎంపీడీవో వేణుగోపాల్ తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అటవీ శాఖ, ఆర్టీసీ, ఆర్ అండ్ బి, ఎక్సైజ్ శాఖ, మత్స్య శాఖ అధికారులు హాజరు కాలేదు.నంగునూరు మండలంలో 11 ఎంపీటీసీల గాను ఏడుగురు మాత్రమే మండల సభలో పాల్గొనగా 24 గ్రామ పంచాయతీల గాను పదిమంది సర్పంచులు మాత్రమే హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు తిప్పని రమేశ్ మాట్లాడుతూ పదవి కాలం పూర్తవుతున్న సందర్భంగా అందరికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామపంచాయతీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టినప్పటికీ ఉప సర్పంచ్ చెక్ పవర్ మూలంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఉప సర్పంచ్ కు చెక్ పవర్ లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతరులకు చెక్ పవర్ ఇవ్వడం వల్ల ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయామని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ మగ్దుంపూర్ ఎంపీటీసీ నితిన్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో సహక రించిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభు త్వాన్నికీ అధికారులు సహకరి ంచాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి గీత, పశు వైద్యాధికారి రాంరెడ్డి, మండల విద్యాధికారి దేశి రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శశాంక్ గణేష్, మిషన్ భగీరథ ఏఈ నర్సింగా రావు, ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ తదితరులు వారివారి శాఖ నివేదికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు బిక్షపతి నాయక్, రాజేంద్ర, అజీజ్ పాషా, మండల కోఆప్షన్ సభ్యులు రహీంపాషా, ఎంపీ టీసీలు బెదురు తిరుపతి, ఏటి తులసి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వివాహానికి పుస్తెమట్టెల అందజేత



నవతెలంగాణ-సిద్ది పేట

గందె లక్ష్మయ్య కుమారుడు గందె కిరణ్ కుమార్ సుజిత సహకారంతో పూజ వివాహం సందర్భంగా పుస్తె, మట్టెలు, చీర అందజేశామని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చింత రాజేంద్రప్రసాద్, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరికిరణ్, కార్యదర్శి చకిలం రవి, కోశాధికారి బూరుగు వేణుగోపాల్, పీఆర్వో అయిత శంకర్, అయిత రత్నాకర్, గందె శ్రీనివాస్, బుక్క శివ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వాటర్ క్యాన్ల పంపిణీ



నవతెలంగాణ-మర్కుక్

ప్రజలందరూ స్వచ్ఛమైన నీరు తాగి ఆరోగ్యంగా ఉండాలని మర్కుక్ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన కోడూరి కరుణాకర్‌రెడ్డి, తన స్వంత ఖర్చులతో ఇంటింటికీ వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. దాత కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ వంతుగా గ్రామాభివృద్ధికి, గ్రామ ప్రజలకు సేవ చేస్తానన్నారు. రానున్న రోజుల్లో సేవాకార్యక్రమాలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాడ ప్రసన్న సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,గ్రామస్థులు, తదిదరులున్నారు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి

- బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి



నవతెలంగాణ-సిద్ది పేటరూరల్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు, రూ.రెండు లక్షల రుణమాఫీ, రూ.500లకు గ్యాస్ తదితర ఆరు గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షే మ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచా యని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బీఆర్ఎస్ పార్టీ ప్రజల ప్రక్షాళన ఉండి పోరాటం చేస్తామని అన్నారు. ప్రజాసేవే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్





నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ అజయ్ గుప్తా జిల్లా పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను శాఖలవారీగా సమీక్ష కోసం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరిమా అగ్రవాల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఈ నెల 15వ తేదీన కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ అజయ్ గుప్తా జిల్లాలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాల తీరును పరిశీలించనున్నారని అన్నారు. గుర్రాలగొంది గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల మీద నమూనాలు, ఫ్లెక్సీలు, స్టాల్ల ఏర్పాటు, వీడియో రూపంలో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ జయదేవ్ ఆర్య, డిపిఓ దేవకీదేవి, ఎల్డిఎం సత్యజిత్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, ఇతర అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-వర్గల్

నూతన పట్టాపాసు పుస్తకం వచ్చిన రైతులందరూ రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి శేషశయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన రైతులు తమ పట్టాదారు పసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్, దరఖాస్తు ఫామ్ ను జతచేసి స్థానిక రైతు వేదికల్లో లేదా వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని తెలిపారు.

కేటీఆర్ మాటలను గమనిస్తున్న ప్రజలు



నవతెలంగాణ-సిద్ది పేట

మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడిన తీరును ప్రజలు గమనిస్తున్నారని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మార్క సతీష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందన్నారు. ముందుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిందన్నారు. తమపై ప్రజ లకు నమ్మకం ఉంచ డంతోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గె లిపించి అధికా రంలో కూర్చో బెట్టారని అన్నా రు. మరోసారి ప్రజా తీర్పును అవహేళన చేసే విధంగా కేటీఆర్ మాట్లాడడం మానుకోవాలని కోరారు.

జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన అక్షయ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.అక్షయ వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. భగవాన్ శ్రీ సత్యసాయి సేవాట్రస్టులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు భూతల మును సురక్షితంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఒక చెట్టును నాటాలనే అంశంపై పోటీలు నిర్వహించారు. సెప్టెంబర్ 15 న సిద్దిపేట జిల్లాలో ఆంగ్ల మాధ్యమంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రథమ బహుమతి గెలిచిన అక్షయకు మెమొంటో, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ పోటీల్లో మిగతా ఐదుగురు విద్యార్థు లకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రథమ బహుమతి పొందిన అక్షయను బుధవారం అభినందించి సన్మానించారు. గత సంవత్సరం ఈ వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సంవత్సరం జిల్లాస్థా యిలో ప్రథమ బహుమతి సాధించిండం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ బి.కిషన్ అభినందించారు. అక్షయను స్ఫూర్తిగా తీసుకుని వచ్చే సంవత్సరం నిర్వహించే వ్యాసరచన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో అవార్డులు తీసుకురావాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన ఉత్కమ్ వెంకటేశ్వర్లుగౌడ్ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు పెడుతల అమరెందర్ రెడ్డి రూ.10 వేలు, ముస్కు లోకేందర్ రూ.10 వేలు, గ్రామస్తుల ఆర్థిక సాయం మొత్తం రూ.55 వేలను గురువారం మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మేరిండ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సాతెల్లి జగన్, రేపాక నరసింహులు, ఉత్కం బాల నరసయ్య, బుచ్చిరెడ్డి, సాయి, శేఖర్ పాల్గొన్నారు.

శ్రీవిద్యాదరి క్షేత్రంలో మూలా నక్షత్ర విశేష పూజలు




నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో గురువారం మూలా నక్షత విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, చండీ హెూమం, లక్ష నామార్చన, లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మూల మహెూత్సవానికి అంకురార్పణ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. శ్రీ విద్యాధరి, శ్రీ శనీశ్వర, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడాయి. దీంతో ఆలయాల సముదాయం అమ్మవారి నామస్మరణతో మార్మోగుతూ ఆధ్యాత్మికత వెల్లువిరిసింది.

శ్రీరామకోటి భక్త సమాజం సంస్థకు భద్రాచల దేవస్థానం ఆహ్వానం





నవతెలంగాణ-గజ్వేల్

భద్రాచల దేవస్థానంలో ఈ నెల 23న కన్నుల పండుగగా జరిగిగే వైకుంఠ ఏకాదశి అధ్యాయనోత్సవాలకు (ముక్కోటి ఏకాదశి) గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థకు ప్రత్యేక ఆహ్వానాన్ని పంపింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ భద్రాచలం దేవస్థానం వారు మా సంస్థ సేవలు గుర్తించి ప్రతి సారి ముక్కోటి ఏకాదశి ప్రత్యేక ఆహ్వానాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. మా సంస్థను గుర్తించి ఇలాంటి అవకాశం ఇవ్వడం మా పై ఉన్న భక్తికి నిదర్శన ం అన్నారు. ఉత రద్వారం ద్వారా ము క్కోటి దేవతలు దర్శ న భాగ్యం పొందడ ం ఎన్నో జన్మల పు ణ్యఫలం అన్నారు.

కొనుగోలు సెంటర్ సందర్శన



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని జనగాం మార్కెటింగ్ సెంటర్‌ను అడిషనల్ డీఆర్‌డీఓ బి.రవీందర్, డీపీఎం విద్యాసాగర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కొనుగోళ్ల విషయంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు అన్ని చాలా సక్రమంగా జరుగుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపిఎం శ్రీనివాస్, సీసీ తిరుపతి, శివ చరణ్ సింగ్, బిక్షపతి, రాజు, వీవో ఏలు అనిత, స్వరూప కమిటీ మెంబర్స్ స్వప్న, రైతులు, తదిదరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేష్



నవతెలంగాణ-కోహెడ

పెయింటింగ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా గడ్డం మహేష్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికకు సహకరిం చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపా రు. కార్యక్రమంలో ఉపా ధ్యక్షుడు మహ ంకాళి అశోక్, ప్రధా న కార్యదర్శి పొన్నాల ప్రసాద్, కారాదర్శి బక్కతట్ల సంబశివరాజ్, ప్రచార కార్యదర్శి, కొడముంజ సుదర్శన్, కోశాధికారి నూదూనూరి సంపత్, గౌరవ అధ్యక్షుడు పైడిపాలా బాలయ్య, సలహాదారులు వి. శ్రీనివాస్, ఏ. మహేందర్ తదితరులు పాల్గొన్నారు

రుత్వికా డ్రై క్లీనింగ్ షాప్ ప్రారంభం



నవతెలంగాణ-గజ్వేల్

యువత స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషించాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. గజ్వేల్ పట్టణంలో మహతి ఆడిటోరి యం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన రుత్వికా డ్రై క్లీనింగ్ షాప్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సి పల్ చైర్మన్ రాజమౌళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో గజ్వేల్ ప్రజ్ఞపూర్ అభివృద్ధి సాధిస్తుందని, వ్యాపార కేంద్రాలకు అనుకూ లంగా గజ్వేల్ దినదిన అభివృద్ధి చెందుతుందని, యువత స్వ యం ఉపాధి మార్గాలను అనే ్వషించి ఆర్థికం గా బలోపేతం కావా లన్నారు. రుత్వికా డ్రై క్లీనింగ్ షాప్ యజమాని పెద్దొల్ల వెంకటేష్ దంపతులను అభినందించారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ జకియుద్దిన్, బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవాజ్,బి ఆర్ ఎస్ నాయకులు గుంటుకు రాజు, శీర్ల మల్లేశం, నర్సింలు, జంగం రమేష్, అహ్మద్, రమేష్, నర్సింలు, మస్తాన్, సాదిక్ పాషా, శ్రీధర్, భూములు, స్వామి, నరేష్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి ,కౌన్సిలర్లు కొంకటి నళినీ దేవి, చిత్తారి పద్మ, భూక్య సరోజన, దొడ్డి శ్రీనివాస్, బొజ్జ హరీష్, కోఆప్షన్ సభ్యులు యండి ఆయూబ్ , కోమటి సత్యనారాయణ, పున్న సది, రాజయ్య గిర్ధవర్, మొహమ్మద్ కరీం జూనియర్ అసిస్టెంట్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధి ప్రధాన లక్ష్యం



నవ తెలంగాణ- గజ్వేల్

వార్డు అభివృద్ధి ప్రధాన లక్ష్యమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఒకటో వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కృషితో మున్సిపల్‌కు నిధులు మంజూరు కావడం వల్ల అభివృద్ధి జరిగిందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. వార్డులో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూసినట్లు తెలిపారు. వార్డులో కొంతవరకు సిసి రోడ్లు మురికి కాలువలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పట్ల వెంటనే స్పందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నట్లు చెప్పారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం



నవతెలంగాణ వర్గల్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు సాధించడంతో పాటు కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ నేత ఈటల రాజేందర్ అన్నారు. గురువారం వర్గల్ మండల బీజేపీ నాయకులతో కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం కష్టతరమన్నారు. గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నానని అన్నారు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ సరైన నిధులు లేక పలు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. గతంతో పోల్చితే బీజేపీకి ఓట్ల శాతం బాగా పెరిగిందన్నారు. ఇది భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి రావడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వర్గల్ మండలానికి చెందిన భాజపా నాయకులు, కార్యకర్తలు, తదిదరులు పాల్గొన్నారు.